సాక్షి
తిరుపతి

బుధవారం । 1 । మే । 2024



సేవకుడిని నేను!
తాను సేవకుడని. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలంతా తన కుటుంబ సభ్యులని తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి అన్నారు. - 8లో



ప్రాణం తీసిన కునుకు
కునుకు ఓ నిండు ప్రాణాన్ని తీసింది. ఈ ఘటన చంద్రగిరిలోని ముంగిలిపట్టు సమీపంలో చోటు చేసుకుంది. - 8లో



వైఎస్సార్‌సీపీలోకి..
జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రచార పర్వాన్ని హోరెత్తిస్తోంది. పలువురు కూటమి నేతలు పార్టీలో చేరుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 77,673 మంది స్వామివారిని దర్శించుకోగా, 30,607 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.10 కోట్లు మర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మీ సేవలు చిరస్మరణీయం



రిటైర్డ్ అయిన వారితో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి క్రైమ్: పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పోలీసుల సేవలు చిరస్మరణీయమని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. మంగళవారం పోలీస్ అతిథి గృహంలో వారిని ఆయన ఆత్మీయంగా సత్కరించారు. రిటైర్డ్ అయిన వారిలో చంద్రగిరి ఏఎస్‌ఐ గుర్రప్ప, ఏఎస్‌ఐలు వెంకటేష్ నాయుడు, శ్రీధర్, హెడ్‌కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ హేమంత్‌కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

అదనపు బ్యాలెట్ యూనిట్లు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: అదనపు బ్యాలెట్ యూనిట్లు అవసరమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ బ్యాలెట్ యూనిట్ల మొదటి విడత సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకులు ఉజ్వల్ కుమార్ ఘోష్, కే.జ్యోతితో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ చేపట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి పార్లమెంట్‌తోపాటుకు 23, తిరుపతి అసెంబ్లీకి 46 మంది, చంద్రగిరి బరిలో 24 మంది ఉండడంతో అదనపు బ్యాలెట్ యూనిట్లు అవసరమైనట్టు వెల్లడించారు. ఈ క్రమంలో చంద్రగిరి, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి ఇంకా 1,133 బ్యాలెట్ యూనిట్లు అవసరముందన్నారు. రిజర్వ్‌లోఉన్న 682 పోను అదనంగా 451 అవసరమవుతాయని చెప్పారు. అలాగే తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి 2,566 బ్యాలెట్ యూనిట్లు అవసరంకాగా.. అందులో రిజర్వ్‌లో ఉన్న 644 పోను అదనంగా 1,922 కావాల్సి ఉంటుందన్నారు. ఈవీఎం నోడల్ అధికారి కోదండరామిరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: ఏప్రిల్‌కు సంబంధించిన సామాజిక పింఛన్లను బుధవారం నుంచి అందించనున్నట్టు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాలు ఉన్నవారికి బ్యాంక్‌లో జమచేస్తారని, లేని వారికి సచివాలయ ఉద్యోగులు వారి ఇంటి వద్దకే వెళ్లి అందిస్తారని స్పష్టం చేశారు. బుధవారం నుంచి శుక్రవారానికి వంద శాతం పింఛన్లు అందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 2,70,390 మంది లబ్ధిదారులు ఉండగా.. వారికి రూ.80.48 కోట్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.


రుయాలో తొలిసారి కిడ్నీ శస్త్ర చికిత్స



చిన్నారితో వైద్యుల బృందం

తిరుపతి తుడా: రాయలసీమలో పేదల పెద్దాస్పత్రిగా సేవందిస్తున్న తిరుపతి రుయాలో 6 నెలల చిన్నారికి అరుదైన కిడ్నీ శాస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. రుయాలో తొలిసారి చిన్నారికి కిడ్నీ శస్త్ర చికిత్స నిర్వహించి ప్రాణం పోశారు. వివరాలు.. చిత్తూరు జిల్లా, ఎస్ఆర్పురం మండలానికి చెందిన ఎన్.కౌశిక్ బాబు (6 నెలలు)కి పుట్టుకతోనే మూత్ర పిండం అడ్డం తిరిగి, చీము గడ్డతో రుయాకు తీసుకొచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు సర్జరీ అవసరమని నిర్ధారించారు. రుయాలోని డాక్టర్ ఏపీ జగదీష్, డాక్టర్ రాజ్‌కిరణ్, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ రాధ, డాక్టర్ మైథిలి, డాక్టర్ మనోహర్‌తో కూడిన వైద్యుల బృందం కిడ్నీ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. వైద్యుల బృందాన్ని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, ఏఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ, అడ్మిన్ చిరంజీవి అభినందించారు.

ఊసరవెల్లి సిగ్గుపడుతోంది!



వీరిని చూస్తే రంగులు మార్చే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది. నేను అప్పుడప్పుడూ రంగులు మార్చితే వీళ్లు ఎన్నికలొచ్చినప్పుడల్లా కండువాలు మార్చేస్తున్నారే..? అంటూ ఒంటికాలిపై లేస్తోంది. పిలిచి టిక్కెట్లిచ్చి.. ఎన్నికల్లో గెలిపించుకున్న తల్లిలాంటి పార్టీకి ద్రోహం చేస్తున్నారని మండిపడుతోంది. ప్రజాసేవను పక్కనబెట్టి స్వార్థ రాజకీయాల కోసం పరితపిస్తున్నారని విరుచుకుపడుతోంది.. అయితే.. వారి ప్రత్యర్థులను చూస్తే జాలేస్తోందని.. వారు సౌమ్యులు.. ప్రజాసేవకులని చెప్పుకొస్తోంది. అసలు జిల్లాలో అలాంటి వారు ఎవరు..? వారి కథా కమామిషు ఏంటో మీరే చదవండి..!

- విలువలకు తిలోదకాలు.. పార్టీలు మార్చడం వారి నైజం
- జనంలో గుర్తింపే లేని వారిని ఎంపీ, ఎమ్మెల్యే చేసిన వైఎస్సార్‌సీపీ
- తల్లిలాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచి పచ్చ కండువా కప్పుకున్న వైనం
- జంపింగ్ జపాంగ్‌లు వరప్రసాద్, ఆదిమూలం, ఆరణిని ఛీదరించుకుంటున్న జనం
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో పోల్చుకుంటే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా!

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జంపింగ్ జపాంగ్‌లంటే ఠక్కున గుర్తుకొచ్చేది ఒకరు వెలగపల్లి వరప్రసాద్, ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం. ఈ ముగ్గురూ ఊసరవెల్లికి మించి రంగులు మారుస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. వీరు చొక్కాలు మార్చినంత ఈజీగా, పార్టీలు, కండువాలు మార్చే నాయకులని చర్చించుకుంటున్నారు. ప్రజాసేవకంటే సొంత ప్రయోజనాలే లక్ష్యంగా పార్టీలు మారుతుంటారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో పార్టీల కండువాలు మార్చడం అలవాటుగా మార్చుకున్నారని చర్చించుకుంటున్నారు. అయితే వీరి ఎంత స్వార్థపరులో ప్రస్తుతం బరిలో ఉన్న వీరి ప్రత్యర్థులు అంత సౌమ్యులని చెప్పుకుంటున్నారు.

దోపిడీకి ఆయనే 'మూలం'

సత్యవేడు టీడీపీ అభ్యర్థి ఆదిమూలం స్వార్థ ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తారనే ప్రచారం ఉంది. ఆదిమూలం మొదట కాంగ్రెస్, ఆ తరువాత టీడీపీలో చేరారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఆదిమూలాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకుని సత్యవేడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా రెండు సార్లు ఎన్నికల బరిలో నిలిపారు. ఒకసారి ఓటమి పాలైనా.. రెండో పర్యాయం ఎమ్మెల్యేగా గెలిపించారు. కానీ ఆయన ప్రజలకు సేవ చేయడంలో విఫలమయ్యారు. ఇసుక, మట్టి అమ్ముకునేవారు. పరిశ్రమల నుంచి మామూళ్లు వసూళ్లు చేసేవారు. ఏదైనా సమస్యపై ఎమ్మెల్యే ఆదిమూలం వద్దకు వెళితే పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు బాధితులు చెబుతున్నారు. తండ్రి పదవిని అడ్డుపెట్టుకుని కుమారుడు సుమన్ చేయని అరాచకాలు లేవు. అధికారులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, విలేకరులపైన దౌర్జన్యాలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే ఆదిమూలానికి వైఎస్సార్‌సీపీ టికెట్ నిరాకరించింది.

ఛీత్కారాలే ప్రజలకు 'వరం'

తిరుపతి పార్లమెంట్ కూటమి అభ్యర్థి వరప్రసాద్ ఎదుటి వాళ్లను తిట్టడం, సొంత వాళ్లను ఆకాశానికి ఎత్తడం ఆయన నైజం. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని 2014లో తిరుపతి ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత గూడూరు ఎమ్మెల్యే అయ్యారు. అయితే ఆయన పనితీరు బాగాలేక పోవడంతో టికెట్ ఇవ్వలేదు. పదవుల రుచి మరిగిన ఆయన గారికి ఇప్పుడు దళిత జాతి ఆత్మగౌరవం గుర్తుకు రావడం విడ్డూరంగా ఉంది. దళితుల్ని జగన్ అణచివేస్తున్నారనే ఆయన గారి విమర్శలు విన్న జనానికి దెయ్యాలువేదాలు వల్లించినట్లుందని చెప్పుకుంటున్నారు. అధికారం కోసం ఆయన మొదట ప్రజారాజ్యం, ఆ తరువాత వైఎస్సార్‌సీపీ, ఇప్పుడు బీజేపీలో చేరారు. టీడీపీ, జనసేన వద్దంటే బీజేపీ కండువా కప్పుకుని కూటమి అభ్యర్థి అయ్యారు. ఇతను పదవి కోసం తప్ప ప్రజలతో సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తుంటారు. గతంలో ఆయన తిరుపతి ఎంపీగా కొనసాగినప్పటికీ,ప్రజానీకంతో సంబంధం లేకుండా, అలంకారప్రాయంగా ఉన్నారు. ఎవరైనా సమస్యతో వరప్రసాద్ దగ్గరికెళితే ఛీత్కరించుకున్న ఘటనలు బోలెడు. వరప్రసాద్ ఎంపీ, ఎమ్మెల్యే అయ్యారంటే కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువే.

రౌడీయిజం..ఆరణి నైజం

తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు చిత్తూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. మొన్నటి వరకు చిత్తూరు జిల్లా కేంద్రం. అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా.. ఆయన అస్సలు పట్టించుకోలేదు. తమ సమస్యలపై వెళితే ఎంత ఇస్తావ్..? అని అడిగిన సందర్భాలేన్నో ఉన్నాయని బాధితులు చెబుతుంటారు. ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకుని భూములు ఆక్రమించుకోవడం, అభివృద్ధి పనుల్లో పర్సెంటేజ్‌లు, అధికారుల నుంచి మామూళ్లు, నమ్ముకున్న వాళ్లకు వెన్నుపోటు పొడవడం, రౌడీయిజం ఆరణి నైజం. ఆయన మొదట టీడీపీలో ఉంటూ.. టికెట్ ఇవ్వకపోతే ప్రజారాజ్యంలో చేరి చిత్తూరు అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. మరళా టీడీపీలో చేరారు. అప్పుడూ టీడీపీ టికెట్ ఇవ్వకపోవడంతో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ఎమ్మెల్యే అయిన ఆరణి స్వార్థ రాజకీయం కోసం జనసేనలో చేరి ప్రశాంతతకు మారుపేరైన తిరుపతిలో అలజడులు సృష్టిస్తున్నారు. స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

గురుమూర్తి.. సదా సేవామూర్తి!

వైఎస్సార్‌సీపీ తిరుపతి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మద్దిల గురుమూర్తి మొహంపై ఎప్పుడూ చిరునవ్వు తొణికసలాడుతుంటోంది. ఎవరు ఏ పని కోసం వెళ్లినా ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకోవడం ఆయన నైజం. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం సీఎం వైఎస్ జగన్ నుంచి నేర్చుకున్న విద్య. తిరుపతి పార్లమెంట్ పరిధిలో రహదారులు, తిరుపతి రైల్వేస్టేషన్ లాంటి ఎన్నో అభివృద్ధి పనుల్ని పరుగులు పెట్టించారు. పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడానికి, కేంద్ర ప్రభుత్వ సంస్థలు జిల్లాకు రావడానికి ఆయన కీలకంగా వ్యవహరించారు.

అభినయ్..విజన్ ఉందోయ్!

తిరుపతిలో ఆరణి ప్రత్యర్థి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి తిరుపతి డిప్యూటీ మేయర్. ఆరణి శ్రీనివాసులు కొడుకు వయస్సు ఉంటుంది. కేవలం డిప్యూటీ మేయర్ పదవి ఉంటేనే తిరుపతి రూపు రేఖలు మార్చేశారు. సింపుల్‌గా చెప్పాలంటే.. 18 మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీ లెఫ్టలు, ప్రధాన కూడళ్ల సుందరీకరణ, హైదరాబాద్ తరహాలో వినాయకసాగర్ అభివృద్ధి, చెన్నారెడ్డి కాలనీలోని పురాతన కోనేరు అభివృద్ధి, 22ఏలో ఉన్న ఇళ్ల స్థలాలకు విముక్తి కల్పించారు. 8 వేల కుటుంబాలకు మేలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఈ రోజు తిరుపతి మహానగరంగా విస్తరించిందంటే.. అందుకు అభినయ్ కృషే కారణం.

శభాష్..రాజేష్

ప్రస్తుత వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ ఉత్సాహవంతుడు, సౌమ్యుడు, మంచివాడు. ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో మొదటి సారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. నియోజకవర్గానికి కొత్తవారైనా.. కొద్ది రోజులకే స్థానికులకు దగ్గరయ్యారు. ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు. సత్యవేడు ప్రజలు నూకతోటి రాజేష్‌ని ఇప్పుడు 'మా వాడు' అంటుండడం విశేషం.

అరాచకాల్లో ఆరితేరిన 'ఆరణి'

ప్రశాంతమైన తిరుపతి పుణ్యక్షేత్రంలో కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు చిత్తూరు రౌడీయిజాన్ని తీసుకొచ్చి అరాచకాలు సృష్టిస్తున్నాడు. చిత్తూరులో ఆరణి జీవితం అవినీతి, అరాచకాలతో నిండినదే. చిత్తూరులో జేబు దొంగగా జీవితాన్ని ప్రారంభించి అవినీతి, అక్రమాలతో ఎమ్మెల్యే స్థాయికి ఎదిగాడు. చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిచి మున్సిపల్ కాంట్రాక్టులన్నీ అతనే దండుకున్నాడు. చిత్తూరు ప్రజలకు చిన్నపాటి మేలు కూడా చేయలేదని మా నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆరణికి టికెట్ ఇవ్వలేదు. టికెట్ ఇవ్వలేదన్న కక్షతో రూ.30 కోట్లు పవన్‌కళ్యాణ్‌కు లంచం ఇచ్చి మరీ టికెట్ తెచ్చుకున్నాడు. తిరుపతి ప్రజలు భూమన కుటుంబానికి ఇస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక మాపై నోటికొచ్చిన అబద్ధాలు చెబుతూ ఆరోపణలు చేస్తున్నాడు'..అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు.

- చిత్తూరులో జేబుదొంగతనాలతో జీవితాన్ని ప్రారంభించిన వ్యక్తి ఆరణి
- పవన్‌కళ్యాణ్‌కు రూ.30కోట్లు లంచం ఇచ్చి సీటు తెచ్చుకున్నాడు
- చిత్తూరు ప్రజలకు ఏమి చేయలేదనే మా నాయకుడు జగన్ సీటు ఇవ్వలేదు
- చిత్తూరు రౌడీయిజాన్ని తిరుపతికి తీసుకొస్తే ప్రజలు ఊరుకోరు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన ఆగ్రహం





తిరుపతి 8వ డివిజన్‌లో భారీ జనసందోహం నడుమ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి(ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న భూమన

తిరుపతి మంగళం : తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నగరంలోని 8, 9 డివిజన్లలో కార్పొరేటర్లు తిరుపతి మునిరామిరెడ్డి, లీలావతిరెడ్డి ఆధ్వర్యంలో మేయర్ శిరీషాతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగనన్నను, తిరుపతిలో ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు తిరుపతిలో కూటమి పేరుతో అందరూ ఒక్కటయ్యారన్నారు. తిరుపతిలో అడుగడుగునా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అడ్డుకుంటూ అరాచకాలు సృష్టిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వాపోయారు. వాళ్లే అరాచకాలు సృష్టిస్తూ వాళ్లే ఎస్పీకి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం హాస్యాస్పదం అన్నారు. జీవకోనలో అమాయకులైన తమ కార్యకర్తలు, ఓటర్లను ఓటు వేయకపోతే చంపుతాం, నరుకుతామని అక్కడి గూండాలు ఫోన్లలో బెదిరిస్తున్నారని ఆరోపించారు. తిరుపతి ప్రజలు చిత్తూరు రౌడీయిజాన్ని తీసుకొస్తే సహించరని, ఓటుతో వారికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తిరుపతిలో పారామిలటరీ దళాలను తీసుకొచ్చి ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దేనన్నారు. పార్టీ నాయకులు ఆదం సుధాకర్‌రెడ్డి, మహ్మద్‌కాసీమ్(చోటాబాయ్), ప్రసాద్, మురళీ, గఫూర్, సుబ్బురాయల్, గుణమ్మ, కొండలరావు, పాండురాయల్, రాజురాయల్, యశోద, రాఖీ, కిషోరమ్మ పాల్గొన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రిన్సిపల్ నరసయ్యను సన్మానిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి సిటీ: యువతకు అవకాశాలు అధికంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్వీయూ వీసీ వీ.శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ కామర్స్, మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీవీ.నరసయ్య ఆధ్వర్యంలో తొలిసారి కళాశాల వార్షికోత్సవాన్ని శ్రీనివాస ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు మానవతా విలువలు పెంపొందించుకుని క్రమశిక్షణతో మెలగాలన్నారు. జీవిత లక్ష్యాన్ని సాకరం చేసుకునే దిశగా నిరంతర కృషి చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో యువత పోటీ పడేందుకు ఎడెక్స్ ద్వారా విదేశీ విద్యను అందిస్తోందని పేర్కొనారు. గౌరవ అతిథి, సిమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ మనిషి ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్యుడు ఎంత ముఖ్యమో.. దేశ ఆర్థికాభివృద్ధికి కామర్స్, మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ సైన్స్ నిపుణులు అంతే అవసరమన్నారు. విద్యార్థులు ఆయా రంగాలలో ప్రతిభ చూపి దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపల్ పీవీ నరసయ్యను వీసీ ప్రత్యేకంగా అభినందించారు. సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, పీ.రఘునాథరెడ్డి, అంజన్‌బాబు, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న వెంటే నడుస్తా



జీవకోనలో జనసేన నాయకులు దాడి చేసిన వలంటీర్ జ్ఞానేశ్వరిని పరామర్శించి, ధైర్యం చెబుతున్న తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్

తిరుపతి మంగళం: 'పేదలకు సేవ చేసే భాగ్యం కల్పించారు. వారి జీవితాల్లో వెలుగులు నింపేలా సీఎం జగనన్న భాగస్వామ్యం చేశారు. కానీ మా సేవలను కించపరుస్తూ జనసైనికులు మాట్లాడడం చూస్తే బాధేస్తోంది. అందుకనే నా పదవికి రాజీనామా చేసి.. జగనన్న సైనికురాలిగా ప్రజల ముందుకు వస్తున్నా' అని వలంటీర్ జ్ఞానేశ్వరి స్పష్టం చేశారు. ఇదివరకే తాను వలంటీర్ పదవికి రాజీనామా చేశానన్నారు. సోమవారం జీవకోనలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తనపై జనసేన నాయకులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారని వాపోయారు. 'నీవు వలంటీర్ కదా.. ప్రచారంలో ఎలా పాల్గొంటావ్' అంటూ దుర్భషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ మంగళవారం జీవకోనలోని వలంటీర్ జ్ఞానేశ్వరి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మీకు నేను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తమ్ముడు గణేష్, కోటేశ్వరమ్మ, టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, పార్టీ నాయకులు నవీన్, తలారి రాజేంద్ర, రెడ్డెప్ప, రమణ, కోటి పాల్గొన్నారు.

యువ న్యాయవాదులు రాణించాలి



జడ్జి అన్వర్‌బాషాను సన్మానిస్తున్న తిరుపతి న్యాయవాద సంఘ కార్యవర్గ సభ్యులు

తిరుపతి లీగల్: యువ న్యాయవాదులు న్యాయవాద వృత్తిలో రాణించాలని తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి అన్వర్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం జడ్జి అన్వర్‌బాషా ఉద్యోగ విరమణ సందర్భంగా తిరుపతి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక న్యాయవాదుల అసోసియేషన్ హాల్లో వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ వృత్తిలో తనకు సహకరించిన న్యాయవాదులందరికీ ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పీ.గోపీచంద్‌తో పాటు పలువురు న్యాయవాదులు జడ్జి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తిరుపతి మూడో అదనపుజిల్లా జడ్జి గురునాథ్, ఐదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, న్యాయవాద సంఘ కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

జడ్జికి న్యాయ రత్న అవార్డు

ఐదో అదనపు జిల్లా జడ్జి అన్వర్ బాషాకు ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘ నేతలు న్యాయ రత్న బిరుదును ప్రదానం చేసినట్లు ఆ ఉద్యోగ సంఘ ఉపాధ్యక్షుడు దామోదరం తెలిపారు. ఈ మేరకు స్థానిక ఐదో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్లో వీడ్కోలు సన్మానసభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో న్యాయశాఖ ఉద్యోగ సంఘం ఉపాధ్యక్షుడు దామోదరం మాట్లాడుతూ న్యాయమూర్తిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఐదో అదనపు జిల్లా జడ్జి కోర్టు సిబ్బంది, ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో ఎన్నికల అబ్జర్వర్


ఆలయం ఎదుట ఎలక్షన్ అబ్జర్వర్

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం ఎలక్షన్ అబ్జర్వర్ మిశ్రా దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆయన ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

'అనగనగా ఒక గ్రామం' షూటింగ్ ప్రారంభం


షూటింగ్‌ను ప్రారంభిస్తున్న పల్లా వేణుగోపాల్

శ్రీకాళహస్తి : మండలంలోని బీవీపురం గొల్లపల్లెలో మంగళవారం అనగనగా ఒక గ్రామం చిత్రం షూటింగ్‌ను ప్రారంభించారు. శ్రీకావమ్మదేవి ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాల అనంతరం వీకన్‌స్ట్రక్షన్స్ అధినేత పల్లా వేణుగోపాల్ క్లాప్‌కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. సినీ కళాకారులు పలువురు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉడమలపాటి మునిబాబు, మునిమారయ్య, మునికామయ్య, అనిలా పరిడా, ఆలయ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన కునుకు!


మృతి చెందిన సుశీలమ్మ

చంద్రగిరి: కునుకు ఓ నిండు ప్రాణాన్ని తీసింది. మరో నలుగురిని ఆస్పత్రి పాలు చేసింది. ఈ ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ముంగిళిపట్టు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక బంగారుపేటకు చెందిన మురళీధర్ తన కుటుంబ సభ్యులతో కలసి కారులో సోమవారం తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం మంగళవారం తెల్లవారుజామున తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ముంగిళిపట్టు వద్ద వెళ్తున్న క్రమంలో డ్రైవర్ అమర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. కారు కల్వర్టును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న మురళీధర్ భార్య సుశీలమ్మ (59) అక్కడికక్కడే మృతి చెందింది. కుమార్తె అనూష, కుమారుడు అమర్, కోడలు ఉమా తీవ్రంగా గాయపడ్డారు. కారులోని ముగ్గురు చిన్నపిల్లలు క్షేమంగా బయటపడ్డారు. కేసు దర్యాప్తులో ఉంది.

సేవకుడిని నేను!

- ప్రజారంజక పాలన సీఎం జగనన్నతోనే సాధ్యం
- చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రామచంద్రాపురం: 'నేను పాలకుడిని కాదు.. సేవకుడిని.. చంద్రగిరి ప్రజలు నా కుటుంబ సభ్యులు.. వారి కోసం నా సర్వశక్తులూ ధారబోస్తా'నని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని అనుప్పల్లి పంచాయతీలో 'మన ఊరికి మన మోహిత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ముందుగా సత్రంకు చేరుకున్న మోహిత్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, యువత ఘన స్వాగతం పలికారు. అనంతరం సత్రం నుంచి ప్రారంభమైన బైక్‌ర్యాలీ సాగింది. మోహిత్‌రెడ్డి బైక్ నడుపుతూ యువతను ఉత్సాహపరిచారు. బొప్పరాజుపల్లి, నూతిగుంటపల్లి, బీరమాకులపల్లి, అనుప్పల్లి, రేకలచేను, ఉప్పిలివంక, గోకులాపురం వరకు ర్యాలీ సాగింది. బొప్పరాజుపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు మోహిత్‌కు క్రేన్ సాయంతో గజమాల వేసి స్వాగతం పలికారు. నెమళ్లగుంటపల్లిలో స్థానిక నాయకులు భారీ పూలమాల వేసి స్వాగతించారు. పంచాయతీలోని ఇంటింటా ప్రచారం చేపట్టిన మోహిత్‌రెడ్డికి మహిళలు మంగళహారతులు పట్టారు. అనంతరం అనుప్పల్లిలో జరిగిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు మెచ్చే పాలన కొనసాగాలంటే సీఎం జగనన్నను గెలిపించుకోవాలన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


బైక్ ర్యాలీలో తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, యువత

అంకితభావంతో సేవ చేస్తా

ఎమ్మెల్యేగా తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు చేసిన సేవలను తాను అంకిత భావంతో కొనసాగిస్తానని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ప్రజలే తన కుటుంబమన్నారు. తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒక్క అనుప్పల్లి పంచాయతీలోనే రూ.20.18 కోట్ల 95 రకాల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఏవీ.బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, తిరుపతి జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, తిరుచానూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, చిట్టిబాబు, భాస్కర్‌రెడ్డి, సర్పంచులు గోవర్ధన్, మురగయ్య, గణపతిరెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరాజులరెడ్డి, నిరంజన్‌రెడ్డి, మోహన్, శంకర్‌రెడ్డి, మునిక్రిష్టారెడ్డి, నరహరి, మురళి, సాంబయ్య, ఇరగామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చంద్ర, సాంబశివారెడ్డి, సిద్ధారెడ్డి, రూపసుందర్‌రెడ్డి, హరి, బాబురెడ్డి, మార్కండేయరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, దొరస్వామిరెడ్డి, త్రిపురాంతకం, శశి రాయల్ పాల్గొన్నారు.

ఖర్చుల విషయంలో జాగ్రత్త


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోటీలో ఉండే అభ్యర్థులు ఖర్చుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు ఉజ్వల్ కుమార్ ఘోష్, అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు కె.జ్యోతి, కైలాష్ వాంఖేడి, పోలీస్ అబ్జర్వర్ అరవింద్ సాల్వేల్‌తోపాటు పోటీలోని అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు మాత్రమే ఖర్చులు చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో మే ఒకటవ తేదీ నుంచి బీఎల్‌ఓ ద్వారా ఇంటింటికీ ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్‌కు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. డీఆర్‌ఓ పెంచల్ కిషోర్, జిల్లా వ్యయపరిశీలకుల నోడల్ అధికారి చరణ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో జోష్


వెంకటగిరి : వైఎస్సార్‌సీపీలో చేరిన ముద్దంపలి గ్రామానికి చెందిన టీడీపీ కుటుంబాలు

వెంకటగిరి(సైదాపురం): జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రచార పర్వాన్ని హోరెత్తించింది. ఈ సందర్భంగా పలువురు కూటమి నేతలు పార్టీలో చేరుతున్నారు. ఇందులో భాగంగా వెంకటగిరి రూరల్ మండలంలోని ముద్దంపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాల్తీరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నేత అంకయ్య సారథ్యంలో ఆ గ్రామంలోని టీడీపీకి చెందిన జమ్మల బుజ్జయ్య, నక్కల గున్నయ్య ఆధ్వర్యంలో సుమారు 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ నేతలు చేమూరు పుల్లయ్య, హరికృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.

బాలాయపల్లిలో..

బాలాయపల్లి మండలంలోని మాజీ ఏఎంసీ చైర్మన్ వెందోటి మధుసూదన్‌రెడ్డి, మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో జయంపు పంచాయతీకి చెందిన సాగునీటి మాజీ అధ్యక్షులు శివాడి సుధాకర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాకయులు ముద్ద శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


బాలాయపల్లి : వైఎస్సార్‌సీపీలో చేరిన బాలాయపల్లి మండలం, జయంపు టీడీపీ నేతలు

చిలమానుచేనులో కీలక నేతల చేరిక

ఓజిలి: చిలమానుచేను గ్రామానికి చెందిన కీలకనేతలు పామూరు రమేష్, కనిబోయిన సుధీర్ స్థానిక నాయకులు వై.రాంప్రసాద్‌రాజు, వై వెంకటరమణరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సమక్షంలో వైఎస్సార్‌సీపీ చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరాం, నాయకులు ఆదిరామయ్య, రామూర్తిరాజు, బాలయ్య, యల్లంరాజు వెంకటేశ్వర్లు రాజు, శ్రీనివాసులు యాదవ్, వంశీ, లోకేష్‌రాజు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి జగనన్న పెద్దపీట

నాయుడుపేట టౌన్ : మహిళా సంక్షేమానికి సీఎం జగనన్న పెద్ద పీట వేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎమ్మెల్యే సంజీవయ్య కుమార్తె డాక్టర్ దివిజ అన్నారు. నాయుడుపేట పట్టణంలోని రజక కాలనీ వద్ద టీడీపీకి చెందిన మహిళా నాయకురాళ్లు కలిపల్లి కృష్ణవేణి, రౌతు చెంగమ్మ, కే.ధనమ్మతో పాటు వంద మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి చైర్‌పర్సన్, ఎమ్మెల్యే కుమార్తె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


ఓజిలి : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


నాయుడుపేట : మహిళలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చైర్‌పర్సన్ దీపిక, ఎమ్మెల్యే సంజీవయ్య కుమార్తె దివిజ

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు


మాట్లాడుతున్న రామ్‌మోహన్ మిశ్రా

తిరుపతి అర్బన్: ప్రశాంతవాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సార్వత్రిక ఎన్నికల రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకులు రామ్‌మోహన్ మిశ్రా సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తోపాటు తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు ఉజ్వల్ కుమార్ ఘోష్, అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు కే.జ్యోతి, కైలాస్ వాంఖడే, పోలీస్ అబ్జర్వర్ అరవింద్ సాల్వేతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. ప్రధానంగా హింసాత్మక సంఘటనలకు, రీపోలింగ్‌కు అవకాశం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జేసీ ధ్యానచంద్ర హెచ్‌ఎం, మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్, డీఆర్వో పెంచలకిషోర్, అదనపు ఎస్పీ వెంకట్రావు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మీకు తెలుసా?

ద్విసభ్య నియోజకవర్గాలు గూడూరు, సూళ్లూరుపేట

గూడూరు రూరల్: ఇప్పుడున్న గూడూరు, సూళ్లూరుపేట నియోజవర్గాలు ఒకప్పుడు ద్విసభ్య నియోజక వర్గాలుగా కొనసాగుతుండేవి. ఈ రెండు నియోజకవర్గాలకు కలిపి ఒకటి జనరల్, మరొకటి రిజర్వుడ్‌గా ఉండేది. 1953వ సంవత్సరం నుంచి 1955 వరకూ పెల్లేటి గోపాలకృష్ణారెడ్డి, మేర్లపాక మునుస్వామిలు ఎమ్మెల్యేలుగా ఉండేవారు. 1955లో మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కూడా పెల్లేటి గోపాలకృష్ణారెడ్డి, మేర్లపాక మునుస్వామిలే ఎమ్మెల్యేలుగా గెలిచారు. వారు 1962 వరకూ కొనసాగారు. అనంతరం గూడూరు, సూళ్లూరుపేట నియోజవర్గాలుగా విడిపోయాయి. అనంతరం జరిగిన ఎన్నికల్లో గూడూరు ఎస్సీకి రిజర్వు కాగా, సూళ్లూరుపేట జనరల్ కేటగిరి అయ్యింది. అప్పుడు సూళ్లూరుపేటకు చెందిన మునుస్వామి గూడూరు ఎమ్మెల్యేగానూ, గూడూరుకు చెందిన సిద్ధయ్యనాయుడు సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం 1962 నుంచి 1972 వరకూ వేమారెడ్డి రామచంద్రారెడ్డి ఇండిపెండెంట్‌గా గూడూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1972- 78 వరకూ ఇండిపెండెంట్‌గా గెలిచిన నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. 1978 నుంచి ఇప్పటి వరకూ గూడూరు నియోజవర్గం ఎస్సీ రిజర్వేషన్‌గా కొనసాగుతోంది. 1978లో పత్రా ప్రకాశరావు, 1983లో జోగి మస్తానయ్య, 1985 బల్లి దుర్గాప్రసాద్‌రావు టీడీపీ ఎమ్మెల్యేలుగా గెలిచారు. 1989లో బల్లి దుర్గాప్రసాద్‌రావు ఎమ్మెల్యేగా ఓడిపోయారు. పత్రా ప్రకాశరావు గెలుపొందారు. అనంతరం 1994, 1999 సంవత్సరాల్లో వరుసగా బల్లి దుర్గాప్రసాద్‌రావు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం 2004లో పత్రా ప్రకాశరావు, 2009లో బల్లి దుర్గాప్రసాద్‌రావు గెలిచారు. 2014లో పాశం సునీల్‌కుమార్, 2019లో వెలగపల్లి వరప్రసాద్‌రావులు విజయం సాధించారు.

చంద్రబాబువి మోసపూరిత హామీలు

- బాబును నమ్మి ఓటు వేస్తే నట్టేట ముంచుతాడు
- 14 ఏళ్లలో పేదలకు చేసింది శూన్యం
- వైఎస్సార్ సీపీ గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్

వాకాడు : ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని, దీంతో అమలుకు వీలుకాని హామీలతో పేదలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యాడని వైఎస్సార్ సీపీ గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన మంగళవారం రావిగుంటపాళెం, నిడిగుర్తి, మూలపడవ, పూడిరాయిదొరువు గ్రామ పంచాయతీల్లో ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు పేదలకు చేసింది శూన్యమన్నారు. 2014లో ఇచ్చిన హామీలను అమలు చేశారా లేదా అన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలను తన పార్టీ కార్యకర్తలకే అందజేశారని గుర్తు చేశారు. ఇప్పుడు అధికార దాహంతో ప్రజలను మళ్లీ మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఆయనను నమ్మి ఓటు వేస్తే నట్టేట ముంచడం ఖాయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని పేర్కొన్నారు. ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ మేనిఫెస్టో ప్రకటించారని తెలిపారు. మాట ఇస్తే నెరవేరుస్తాడని, చంద్రబాబులా మోసం చేసే నైజం తమ నాయకుడిది కాదన్నారు. మేలు చేసిన జగనన్న ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గురుమూర్తిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కొడవలూరు దామోదర్‌రెడ్డి, దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, బి.వెంకటరత్నం, వెంకటాద్రి, డి.భాస్కర్‌రెడ్డి, వి.జనార్ధన్‌రెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, పి.రాజశేఖర్‌రెడ్డి, మల్లాపు నాగరాజు, కిషోర్, వాకాటి రవికుమార్, నల్లపరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


వల్లమేడులో మేరిగ మురళీధర్‌కు హారతి పడుతున్న మహిళలు

నేడు చిట్టమూరులో మేరిగ మురళీధర్ ప్రచారం

చిట్టమూరు(చిల్లకూరు) : వైఎస్సార్‌సీపీ గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ బుధవారం చిట్టమూరు మండలంలో ప్రచారం చేయనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఎల్లసిరి, మన్నెమాల, ఈశ్వర వాక, ఆలేటిపాడు, చిట్టమూరు, పిట్టివానిపల్లి, ముక్కిడిపాళెం, పల్లపర్తి, మల్లాం పంచాయతీల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తారని పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


ప్రచారంలో పాల్గొన్న స్థానిక యువత